క్లుప్తంగా

ఉపాధ్యాయుడికి వీడ్కోలు సన్మానం



గొట్టివాడ వెంకటరమణను సత్కరిస్తున్న హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు

కంచరపాలెం: రామ్మూర్తిపంతులుపేట జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా 30 ఏళ్లు సేవలందించిన గొట్టివాడ వెంకటరమణ పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం సాయంత్రం పాఠశాలలో నిర్వహించిన పదవీ విరమణ సభలో ఆయనను ప్రధానోపాధ్యాయుడు ఆర్.శ్రీనివాసరావు నేతృత్వంలో ఘనంగా సత్కరించారు. శేషజీవితం ఆయురారోగ్యాలతో గడపాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పేరెంట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బదిలీ అయిన ఉద్యోగికి సత్కారం



శ్రీకాంత్ దంపతుల వీడ్కోలు కార్యక్రమంలో పంప్‌హౌస్ కార్మికులు

మల్కాపురం: హిందుస్థాన్ షిప్‌యార్డ్ పంప్ హౌస్ సెక్షన్ (కాలనీ పంప్‌హౌస్)లో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న భోగవల్లి శ్రీకాంత్‌కి వేరే చోటుకు బదిలీ కావడంతో శుక్రవారం ఆయన వీడ్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీకాంత్ దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన మురళీకృష్ణ మాట్లాడుతూ పంప్‌హౌస్ సెక్షన్‌లో మేనేజర్ శ్రీకాంత్ అందించిన సేవలను గుర్తు చేశారు. పంప్‌హౌస్ కార్మికులు విజయ్,కమల్,సుమన్,రామకృష్ణ, ఆంజనేయులు, నాయుడు పాల్గొన్నారు.

సరుగుడు తోట దగ్ధం



దగ్ధమైన సరుగుడు తోట

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం శివారు మేడు గుల్లు సమీపంలో ఉన్న సరుగుడు తోటను ఆకతాయిలు దగ్ధం చేశారు. శరగడం నరసింహారావు సుమారు ఎకరా స్థలం సరుగుడు , నీలగిరి తోట వేశాడు. ఏపుగా పెరిగిన తోటకు ఆకతాయిలు, గంజాయి బ్యాచ్ నిప్పుపెట్టారని వాపోతున్నారు. మద్యం సేవించేందుకు, గంజాయి సేవించేందుకు వచ్చిన వారే ఈ తోటను దగ్ధం చేశారని వాపోయారు. సుమారు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లినట్టు బాధితుడు చెబుతున్నారు. ఆకతాయిలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రద్దు

తాటిచెట్లపాలెం: కడియం-ద్వారపూడి-అనపర్తి సెక్షన్ మధ్య ఆధునికీకరణ పనులు జరుగుతున్న కారణంగా ఆయా తేదీల్లో పలు రైళ్లు రద్దు చేశారు. ఈ నెల 1, 2వ తేదీల్లో గుంటూరు-విశాఖపట్నం(12739) సింహాద్రి ఎక్స్‌ప్రెస్, 2,3వ తేదీల్లో విశాఖపట్నం-గుంటూరు(12740)సింహాద్రి ఎక్స్‌ప్రెస్, 2న ఇరువైపులా విశాఖపట్నం-గుంటూరు-విశాఖపట్నం (22701/22702) ఉదయ్ డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-లింగంపల్లి(12805) జన్మభూమి ఎక్స్‌ప్రెస్, 3న లింగంపల్లి-విశాఖపట్నం(12806) జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

అనుమతులు లేకుండా ఔషధాల విక్రయం

విశాఖ లీగల్: అనుమతి లేకుండా మందుల దుకాణం నిర్వహించిన వ్యక్తికి ఆరు నెలలు జైలు, రూ.50 వేల జరిమానా విధిస్తూ నగరంలోని రెండవ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి సి.కె.గాయత్రి దేవి శుక్రవారం తీర్పు నిచ్చారు. ఇన్‌చార్జి పబ్లిక్ ప్రాసిక్యూటర్ కం జిల్లా ప్రధాన న్యాయస్థానం పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాండ్రేగుల జగదీశ్వరరావు తెలిపిన వివరాలివి.. నగరంలోని నందగిరినగర్‌లో ఎటువంటి అనుమతులు లేకుండా మద్దాల సత్యనారాయణ ఔషధాలు విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు 2013 జూన్ 14న ఔషధ తనిఖీ అధికారులు ఆర్.లలిత, కె.రజిత, ఎ.టి.వి.రమాదేవి ఈ దుకాణాన్ని తనిఖీ చేశారు. అక్కడ ఎటువంటి లైసెన్సులు లేకుండా కొన్ని మందులు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. అతనిపై ఔషధ విక్రయ నిషేధ చట్టం సెక్షన్ 23(5)(బి) కింద కేసు నమోదు చేశారు.నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చారు.



గోపాలపట్నం శ్మశానవాటిక ముఖద్వారం

పాత భవనాలకు మరమ్మతులు

ఇన్నాళ్లకు మోక్షం!

గత ప్రభుత్వంలో రూ.90 లక్షల మంజూరు

ఎట్టకేలకు జోరందుకున్న పనులు

మారనున్న గోపాలపట్నం శ్మశానవాటిక రూపురేఖలు



ఆధునికీకరించిన శవదహన వేదికలు



శ్మశాన వాటికలో నిర్మిస్తున్న మరుగుదొడ్లు

గోపాలపట్నం: ఖర్మ స్థలానికి పట్టిన గ్రహణం ఇన్నాళ్లకు వీడింది. రాజకీయ నిర్లక్ష్యానికి గురైన గోపాలపట్నం శ్మశాన వాటిక బాగుపడుతోంది. ఇక్కడ అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. గత ప్రభుత్వంలో శ్మశాన వాటిక అభివృద్ధికి రూ.90 లక్షలు మంజూరు చేశారు. ఆ పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి.

సమకూరుతున్న హంగులు

శ్మశానాటిక అభివృద్ధికి నిధులు సమృద్ధిగా మంజూరు కావడంతో సకల హంగులు కల్పిస్తున్నారు. నీటి సదుపాయంతో పాటు ప్రత్యేక గదులు ఏర్పాటు చేస్తున్నారు. శవదహన వేదికలను ఆధునికీకరణ చేస్తున్నారు.

ఆధునిక టాయ్‌లెట్లు

శ్మశానాటికలో అధునాతన టాయిలెట్లు నిర్మిస్తున్నారు. గతంలో ఇక్కడ టాయిలెట్లే లేవు. దహన సంస్కారాలకు వచ్చేవారు నానా అవస్థలు పడేవారు. ఇప్పుడు ఇబ్బందులు లేకుండా అన్ని సదుపాయాలు కల్పిస్తున్నారు.

నాలుగు భవనాలు...

శ్మశాన వాటికలో ప్రజల అవసరాలకు తగిన విధంగా నాలుగు భవనాలు నిర్మిస్తున్నారు. అందులో రెండు కొత్తవి.. రెండు పాతభవనాలకు మరమతులు చేస్తున్నారు. శవదహన సమయంలో వేచి ఉండేందుకు, దహన సంస్కారాలు అయిన తర్వాత బూడిద ఉంచేందుకు, దహ సంస్కారాలకు అవసమైన కర్రలు ఉంచేందుకు ఒక గది నిర్మిస్తున్నారు. వీటితో పాటు స్నానాల గదులు నిర్మిస్తున్నారు.

సుందరీకరణ చేపట్టాలి

అభివృద్ధి పనుల్లో భాగంగా శ్మశాన వాటికలో సుందరీకరణ పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ప్రధాన రహదారిని ఆనుకుని శ్మశాన వాటిక పరిసరాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.

ఎట్టకేలకు పూర్వ డీఆర్‌ఎంకు బెయిల్

సొంత పూచీకత్తుతో బెయిల్ ఇచ్చిన సీబీఐ స్పెషల్ కోర్టు



సౌరభ్‌కుమార్ ప్రసాద్

సాక్షి, విశాఖపట్నం: టెండర్లకు సంబంధించి కాంట్రాక్టర్ నుంచి రూ.25 లక్షలు లంచం తీసుకుంటూ సీబీఐకి చిక్కిన వాల్తేరు రైల్వే పూర్వ డీఆర్‌ఎం సౌరభ్‌కుమార్ ప్రసాద్‌కు ఎట్టకేలకు బెయిల్ మంజూరైంది. గతేడాది నవంబర్‌లో ముంబయిలో ఓ కాంట్రాక్ట్ సంస్థకు చెందిన వ్యాపారుల నుంచి లంచం తీసుకుంటూ సౌరభ్‌కుమార్ దొరికిపోయిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి సీబీఐ జైలులోనే సౌరభ్‌కుమార్ ఉన్నారు. హిందూస్థాన్ ఫైబర్ గ్లాస్ వర్క్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు సంబంధించి రూ.3.17 కోట్ల బిల్లు పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే పనులు ఆలస్యంగా చేయడంతో రైల్వే బోర్డు భారీ జరిమానా విధించింది. ఈ నేపథ్యంలో బిల్లులు క్లియరెన్స్‌తో పాటు జరిమానా తగ్గించేందుకు సౌరభ్‌కుమార్ రూ.30 లక్షల లంచం అడిగినట్లు సీబీఐ విచారణలో వెల్లడైంది. చివరికి రూ.25 లక్షలు ఇచ్చేందుకు వ్యాపారులు అంగీకరించడంతో పుణెలో లంచం తీసుకుంటూ కేంద్ర దర్యాప్తు సంస్థకు రెడ్ హ్యాండెడ్‌గా సౌరభ్‌కుమార్ దొరికిపోయారు. పలుమార్లు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నా సీబీఐ ప్రత్యేక కోర్టు(ముంబయి) తిరస్కరించింది. చివరికి సొంత పూచీకత్తుతో శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. సౌరభ్‌కుమార్ నేరాలకు సంబంధించిన పూర్తి ఆధారాలను సీబీఐ అధికారులు కోర్టుకు సమర్పించారు. నిందితుడు ఇప్పటికే సస్పెండ్ అయ్యారని తెలిపారు. సాక్షుల వాంగ్మూలాలు కూడా తీసుకున్న నేపథ్యంలో.. సాక్ష్యాలు, రికార్డులు తారుమారు చేసే అవకాశం లేదని సీబీఐ స్పెషల్ కోర్టు న్యాయమూర్తి అమిత్ ఖర్కర్ అన్నారు. నేరారోపణ నిరూపితమైతే సౌరభ్‌కుమార్‌కు ఏడేళ్ల జైలు శిక్ష విధించే అవకాశం ఉన్నందున.. శిక్ష తీవ్రతను పరిగణలోకి తీసుకుని బెయిల్ మంజూరు చేస్తున్నట్లు న్యాయమూర్తి పేర్కొన్నారు.

9 మందికి క్యాంపస్ కొలువులు



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల చైర్మన్ సత్యనారాయణ తదితరులు

గోపాలపట్నం: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 9 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల చైర్మన్ సత్యనారాయణ తెలిపారు. రూ. 3.5లక్షల వార్షికాదాయంతో ఉద్యోగాలు పొందారన్నారు. సుదర్‌లాండ్ అనే కంపెనీ ఈ ఆఫర్ ఇచ్చిందని ప్రిన్సిపాల్ డ్టార్ ప్రదీప్ వర్మ చెప్పారు. కార్యక్రమంలో సుదర్‌లాండ్ సంస్థ ప్రతినిధులు ఎం. సుదీప్తి, శరణ్య, సీడీసీ డీన్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

రూ.200 కోట్లతో 15 రోడ్ల నిర్మాణం

వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్



సమావేశంలో పాల్గొన్న వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్ తదితరులు

బీచ్‌రోడ్డు: ఈ ఏడాది కాలంలో రూ.200 కోట్ల పెట్టుబడులతో 15 రహదారులను నిర్మించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ తెలిపారు. సీఐఐ వార్షిక సమావేశంలో భాగంగా స్వర్ణాంధ్ర విజన్-2029 విశాఖపట్నం ప్రాంత వృద్ధి అనే అంశంపై శుక్రవారం సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి అజెండాలో విశాఖపట్నం వ్యూహాత్మక ప్రాధాన్యాన్ని వివరించారు. నీతి ఆయోగ్ సహకారంతో అభివృద్ధి చేసిన గ్రోత్ హబ్ భావనకు అనుగుణంగా విశాఖ నగరం ఉందని విశ్వాసం వ్యక్తం చేశారు. భోగాపురం విమానాశ్రయం పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చేలోపే రద్దీని తగ్గించే ప్రణాళికలను రూపొందించామన్నారు. నీటి కొరత లేకుండా పురాతన నీటి వనరులను పునరుద్ధరిస్తున్నట్లు చెప్పారు. నీతి ఆయోగ్‌లోని పీపీపీ, ఐలాండ్ ప్రోగ్రాం డైరెక్టర్ పార్థసారథి రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో పొడవైన తీరప్రాంతం ఉండటం వల్ల పరిశ్రమలకు లాజిస్టిక్స్ ఖర్చులు తగ్గుతాయన్నారు. సీఐఐ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ మురళీ కృష్ణ మాట్లాడుతూ 500 ఎకరాల డేటా సిటీ, యూనివర్సిటీ ఆఫ్ ఇన్నోవేషన్ వంటి కార్యక్రమాల ద్వారా ఏఐ ప్రతిభకు ప్రపంచ ప్రధాన కార్యాలయంగా విశాఖ నగరాన్ని తీర్చిదిద్దేందుకు, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఎర్నెస్ట్ డైరెక్టర్ అమిత్ మజుందార్, సీఐఐ విశాఖపట్నం చైర్మన్ రాజేష్ గ్రంధి తదితరులు పాల్గొన్నారు.

త్వరలో పోలీసులకు సీటీ కరోనరీ యాంజియోగ్రామ్

సీపీ శంఖబ్రత బాగ్చి



పరేడ్‌లో వందనం చేస్తున్న పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

అల్లిపురం: నగర పోలీస్ కమిషనరేట్ పోలీస్ ఆర్మ్‌డ్ రిజర్వ్ గ్రౌండ్స్‌లో శుక్రవారం వార్షిక డీ-మోబిలైజేషన్ సెర్మోనియల్ పరేడ్ ఘనంగా జరిగింది. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ముఖ్య అతిథిగా పాల్గొని పరేడ్‌ను పరిశీలించారు. సిబ్బంది నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పోలీస్ అధికారులు, సిబ్బందికి వార్షిక డీ-ఆర్మ్‌డ్ రిజర్వ్ శుభాకాంక్షలు తెలిపారు. 2019 తర్వాత ఈ ఏడాది మళ్లీ మోబిలైజేషన్ నిర్వహించినట్లు చెప్పారు. పోలీస్ నిబంధనల ప్రకారం ప్రతి జిల్లాలోనూ ఆర్మ్‌డ్ రిజర్వ్ జనవరి, ఫిబ్రవరిలో 12 నుంచి 13 రోజులు చేయాలన్నారు. ఈ నెల 14 నుంచి నిర్వహించిన శిక్షణ శుక్రవారంతో ముగిసిందన్నారు. ఫైరింగ్, ఫిజికల్, యోగా తదితర అంశాల్లో శిక్షణ ఇచ్చామన్నారు. ఆయుధాలతో విధులు నిర్వహిస్తున్నప్పుడు సిబ్బంది చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎటువంటి సమస్య ఉన్నా తనకు ఫోన్ చేయాలని, తప్పకుండా సాయం చేస్తానని చెప్పారు. సెలవులు ఇవ్వకపోతే తనకు తెలియజేయాలని కోరారు. చెడు అలవాట్లకు, ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలన్నారు. త్వరలోనే సిబ్బందికి సీటీ కరోనరీ యాంజియోగ్రామ్ చేస్తామన్నారు.

శ్మశానవాటిక అభివృద్ధి పనులకు బ్రేక్

విద్యుత్ సౌకర్యం లేక నిలుపుదల



60వ వార్డులోని హిందూ శ్మశానవాటిక

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డులోని కోరమాండల్ సంస్థకు అతి చేరువలో సుమారు 10 ఎకరాల విస్తీర్ణంలో గల హిందూ శ్మశానవాటిక అభివృద్ధి పనులు ప్రారంభంలోనే నిలిచిపోయాయి. పారిశ్రామిక ప్రాంత పరిధిలో ఎవరైనా చనిపోతే ఇక్కడే దహన సంస్కరాలు చేపడతారు. ఇక్కడ శ్మశానవాటిక ఏర్పాటు చేసి అనేక ఏళ్లు గడవడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరింది. మృతదేహంతోపాటు వచ్చే వారు ఇక్కడ నిలువలేని పరిస్థితి నెలకొంది. ఈ సమస్యపై 'సాక్షి'తోపాటు పలు పత్రికల్లో వరుస కథనాలు రావడంతో స్పందించిన అధికారులు సుమారు రూ.1.90 కోట్లతో శ్మశానవాటిక రూపురేఖలు మార్చేలా నిధులు మంజూరు చేశారు. దీంతో వారం కిందట సంబంధిత కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. అయితే శ్మశానవాటికకు విద్యుత్ సౌకర్యం(కరెంట్ మీటర్)లేకపోవడంతో మొదలైన పనులు కాస్తా నిలిచిపోయాయి. పాత భవనం కూల్చాలన్నా, కోలమ్స్ ఏర్పాటు చేయాలన్న వాడే పరికరాలు విద్యుత్ సరఫరాతో సాగుతాయి. జనరేటర్ ఏర్పాటు చేసుకుని సదరు కాంట్రాక్టర్ పనులు చేపట్టవచ్చు కానీ అది ఖర్చుతో కూడినది కావడంతో విద్యుత్ సౌకర్యం కోసం వేచి చూస్తున్నారు. శ్మశానవాటిక అభివృద్ధి పనులు ప్రారంభంలోనే ఆగాయని, విద్యుత్ సౌకర్యం కల్పించి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

'పది' పరీక్షల నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ

అధికారులకు కలెక్టర్ ఆదేశం

విశాఖ విద్య: పదో తరగతి పరీక్షల నిర్వహణలో భాగస్వాములయ్యే అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విజయవంతం చేయాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్ పిలుపునిచ్చారు. జ్ఞానాపురంలో సిల్వర్ జూబ్లీ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో పరీక్షల విధులు కేటాయించిన అధికారులతో శుక్రవారం జరిగిన శిక్షణ సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఏ ఒక్క విద్యార్థి నేలపై కూర్చుని పరీక్ష రాయకూడదన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎట్టి పరిస్థితుల్లోనూ మొబైల్ ఫోన్లను తీసుకుని వెళ్లకూడదన్నారు. పరీక్ష కేంద్రాలను నో మొబైల్ జోన్‌గా ప్రకటిస్తూ ఎక్కడికక్కడ నోటీసులు అతికించాలని ఆదేశించారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, దగ్గరలోని జిరాక్స్ షాపులను మూసివేయించాలన్నారు. పరీక్ష ప్రశ్నాపత్రాలను పోలీస్ స్టేషన్‌లో భద్రపరచడం, అక్కడ నుంచి కేంద్రాలకు తీసుకు వస్తున్నప్పుడు, తిరిగి పోస్టాఫీసుకు పంపించేటప్పుడు ఎటువంటి నిర్లక్ష్యం వహించకూడదన్నారు. ప్రతిక్షణం అప్రమత్తతో ఉంటూ పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని స్పష్టం చేశారు. ప్రాంతీయ విద్యాసంచాలకుడు బి.విజయభాస్కర్, డీఈవో ఎస్.ప్రేమ్ కుమార్, డీసీఈబీ సెక్రటరీ కృష్ణ కుమార్ పాల్గొన్నారు.

ఏఎంసీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ సంధ్యాదేవి

దాబాగార్డెన్స్: ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కె.వి.ఎస్.ఎం సంధ్యాదేవిని నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏఎంసీ ఓబీజీ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమెకు ప్రిన్సిపాల్‌గా పూర్తి అదనపు బాధ్యతలు(ఎఫ్‌ఏసీ) అప్పగించారు. ఇప్పటివరకు ప్రిన్సిపాల్‌గా ఉన్న డాక్టర్ గరుడ బుచ్చిరాజు ఉద్యోగ విరమణ చేయడంతో.. ఆయన స్థానంలో సంధ్యాదేవిని నియమించారు.

వాకింగ్ పార్కుకు మహర్దశ

రూ.17 లక్షలతో అభివృద్ధి పనులు



వాకింగ్ పార్కులో నూతనంగా నిర్మిస్తున్న ముఖద్వారం



పార్కు రక్షణ గోడకు పెయింట్ వేస్తున్న కార్మికులు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వాకింగ్ పార్కుకు మహర్దశ పట్టింది. పార్కులో అభివృద్ధి పనులు చేపట్టడానికి రూ.17 లక్షలు మంజూరయ్యాయి. దీంతో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి.

ఇదీ పరిస్థితి

పార్కులో వసుతులు లేక వాకర్స్ తీవ్ర అసౌకర్యానికి గురయ్యేవారు. దీనిపై వాకర్స్ జీవీఎంసీ ఉన్నతాధికారులతో పాటు వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్ దృష్టిలో ఈ సమస్య పెట్టారు. స్పందించిన కార్పొరేటర్ సురేష్ నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి దృష్టికి తీసుకు వెళ్లి సుమారు రూ. 17 లక్షలు మంజూరయ్యే విధంగా చర్యలు తీసుకున్నారు. దీంతో పార్కులో మరుగుదొడ్ల మరమ్మతులు, రక్షణగోడకు పెయింటింగ్,వాకింగ్ ట్రాక్ మరమ్మతులు ,విద్యుత్ షో ల్యాంప్స్ ఏర్పాటు ఇలా పలు అభివృద్ధి పనులు చేపడతున్నారు. పనులు రెండు వారాల్లో పూర్తి కానున్నట్టు వర్క్స్ అధికారులు వివరించారు.

సైన్స్ ప్రయోగాల వైపు.. విద్యార్థుల చూపు



ఆర్పీ పేట స్కూల్‌లో సైన్స్ ప్రయోగాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కంచరపాలెం: పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు తమలో దాగిన సృజనను వెలికితీసేలా ఎన్నో ప్రయోగాలు చేపడుతున్నారని ప్రధానోపాధ్యాయుడు ఆర్.శ్రీనివాసరావు అన్నారు. జాతీయ విజ్ఞాన దినోత్సవం సందర్భంగా శుక్రవారం 56వ వార్డు రామ్మూర్తిపంతులుపేట జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో సైన్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో వక్తృత్వ, వ్యాస రచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ పాఠశాలల్లో జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించే సంప్రదాయం క్రమంగా పెరిగితే విద్యార్థి లోకం ప్రయోగాలపై ఆసక్తి చూపుతుందన్నారు. సి.వి.రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు రూపొందించిన ప్రయోగాలను ప్రదర్శించారు. ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. సైన్స్ ఉపాధ్యాయులు కె.సత్యనారాయణ, సిహెచ్.చంద్రశేఖర్, పెద్దాడ వెంకటేశ్వరరావు, బి.పరమేశ్వరరావు, అల్లం వెంకటరమణ, ఆదిశేషగిరి, శిరీష, ఉమాసత్యవేణి, సునీత, కనకరత్నం, సిబ్బంది పాల్గొన్నారు.



జింక్ స్కూల్లో విద్యార్థినులు ప్రదర్శించిన ఉపగ్రహాల ప్రాజెక్టు

ఆలోచింపజేసిన సైన్స్ ఎగ్జిబిషన్

మల్కాపురం: ఎస్ఆర్ డీజీ (జింక్ స్కూల్)లో విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు ఆలోచింపజేశారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన పలు ప్రాజెక్టులను ప్రదర్శించారు. వీటిలో సోలార్ సిస్టం, వాటర్ ప్యూరిఫైర్, కాలుష్య రహిత నగరం వంటి ఆకృతులు ఆకట్టుకున్నాయి.

నూతన కార్యవర్గం ఎన్నిక

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు జింక్ ఆంజనేయస్వామి ఆలయం ఎదురుగా శుక్రవారం నిర్వహించిన సమావేశంలో గోకుల యాదవ సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడిగా పుర్రె అప్పారావుయాదవ్, అధ్యక్షుడిగా పుర్రె సురేష్‌యాదవ్, ఉపాధ్యక్షులుగా నూనెల వెంకటరమణయాదవ్, ఎదురు కృష్ణారావు యాదవ్,ప్రధాన కార్యదర్శిగా ఉరుకూటి శ్రీనివాస్ దేవయాదవ్, కార్యదర్శులుగా నూనెల రాజుయాదవ్,ఉరుకూటి సింహాచలంయాదవ్, సహాయ కార్యదర్శిగా ఉరుకూటి కాశీయాదవ్,ఎదురు వెంకటరావుయాదవ్,కోశాధికారిగా ఎదురు సత్యనారాయణ యాదవ్‌తో పాటె కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశారు.